ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.30 (122.1967)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.70 (2.71)	30.90	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.29 (0.38)	నిల్	నిల్

చికెన్ ధరలు	లైవ్ : రూ.140	డ్రెస్ : రూ.210	స్కిన్‌లెస్ : రూ.235



ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కలెక్టర్ X వైద్యసిబ్బంది

- ఆస్పత్రిపై కలెక్టర్ కార్యాచరణను వ్యతిరేకిస్తున్న వైద్యులు, సిబ్బంది
- రోజుకో జిల్లా అధికారి పరిశీలనను విరమించాలని డిమాండ్
- ఇతర శాఖల అధికారులకు తనిఖీ అధికారం లేదనే వాదన
- సాయంత్రం వరకు సాగిన సమ్మె, ఆందోళన
- సేవలు, పాలన మెరుగుకే అంటున్న ఉన్నతాధికారులు
- 2018లో ఇచ్చిన మెమో ప్రకారం తనిఖీ అధికారాలూ ఉన్నాయనే దానిపై చర్చ

జిల్లా కేంద్ర ప్రధానాస్పత్రిలో సేవలు మెరుగుపరచడంతో పాటు అందరినీ జవాబుదారీ చేయాలనే ఉద్దేశంతో కలెక్టర్ చేపట్టిన కార్యాచరణపై ప్రొఫెసర్లు, వైద్యులు, సిబ్బంది నుంచి వ్యతిరేకత వచ్చింది. తొలుత సమీక్ష సందర్భంగా కలెక్టర్ సూచించిన మార్పులకు అంగీకారం తెలిపిన వీరు, అది అమలులోకి వచ్చాక జిల్లా స్థాయి అధికారులు పరిశీలన పేరుతో తమను అవమానిస్తున్నారని, కలెక్టర్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మూకుమ్మడిగా సమ్మెకు దిగారు. దీంతో పాలనాయంత్రాంగం వర్సెస్ వైద్యసిబ్బందిగా వాతావరణం నెలకొనడంతో జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం వరకు ఉద్రిక్తత కొనసాగింది. కలెక్టర్ ఉత్తర్వులు ఉపసంహరించుకునేంతవరకు తాము విధులు చేపట్టేదిలేదని వైద్యులు, సిబ్బంది తేల్చిచెప్పడంతో ఈ వివాదానికి ముగింపుపై ఆసక్తి నెలకొంది. ● నల్లగొండ

జిల్లా కేంద్ర ప్రధానాస్పత్రిలో రోజుకో జిల్లా స్థాయి అధికారి పరిశీలన చేయాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైద్యకళాశాల ప్రొఫెసర్లు, వైద్యులు, నర్సులు, సిబ్బంది, కార్మికులు మూకుమ్మడిగా సమ్మెకు దిగారు. గురువారం ఉదయం 11గంటలకు నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద ఆందోళన ప్రారంభం కాగా, సాయంత్రం వరకు కొనసాగింది. అత్యవసర సేవలు మినహా, మిగిలిన అన్ని సేవలను నిలిపివేసి వైద్యులు ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రొఫెసర్లుగా, డాక్టర్లుగా ఉన్న తమపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారులు తప్ప ఇతర శాఖల అధికారులకు ఎలాంటి తనిఖీ అధికారం లేదని, అలాంటిది తమ వృత్తిని, తమను అగౌరవపరిచేలా కలెక్టర్ నిర్ణయం ఉందని, దీన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వారితో పాటు నర్సులు, సిబ్బంది, కార్మికులు సైతం విధులను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ నారాయణరెడ్డి, వైద్యులతో చర్చలు జరిపేందుకు అదనపు కలెక్టర్ పూర్ణచంద్రను ఆస్పత్రికి పంపారు. సేవల మెరుగుకు, శానిటేషన్, ఆహార సరఫరాలో నాణ్యత, తాగునీటి సరఫరాలో లోపాలు సరిచేసేందుకు ఈ పరిశీలన ఆయన వివరించారు. ఆస్పత్రిలో యంత్రాలకు అవసరమైన టెక్నీషియన్లను నియమించేందుకు, అన్ని విభాగాలు సక్రమంగా పనిచేసేందుకు అవసరమైన సూచనలు, సలహాలు అందించడంతోపాటు, అవసరమన తోడ్పాటునందించేందుకే జిల్లా అధికారులు పరిశీలన చేస్తారే తప్పా, వైద్యుల విధులు, వృత్తిలో జోక్యం చేసుకోరని, కేవలం పాలనను మెరుగుపరచేందుకు ఉన్న వనరులను సద్వినియోగపరచడం, కొత్త వనరుల కల్పనకు అవసరమైన చర్యలు సూచించడమే అధికారుల పరిశీలనల ఉద్దేశమని అదనపు కలెక్టర్ వివరించే ప్రయత్నం చేశారు. అయినా రాష్ట్రంలో ఎక్కడాలేని రీతిలో ఈ ఈ నిబంధనలేంటని, తమను అవమానిస్తే విధులు ఎలా నిర్వహిస్తామని తేల్చిచెప్పడంతో అదనపు కలెక్టర్ అక్కడి నుంచి వెనుదిరిగారు.



వైద్యులతో చర్చిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ

కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న సీ.నారాయణరెడ్డి మూడురోజుల్లోనే ఆస్పత్రిలో పారిశుధ్యలోపం, నీటికొరత, సిబ్బంది లంచాల వ్యవహారం, సేవల్లో నాణ్యతలోపాలు, సమయపాలన లేకపోవడం వంటి అంశాలు ఆయన ఆకస్మిక తనిఖీలో బయటపడగా, రోగుల వద్ద లంచం తీసుకుంటున్న ఇద్దరు వార్డ్‌బాయ్‌లను అక్కడికక్కడే విధుల నుంచి తొలగించారు. ఈనెల 21న ఆస్పత్రిలోని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, అన్నివిభాగాల అధిపతులు, వైద్యులు, సిబ్బంది, కాంట్రాక్టర్లతో కలెక్టర్ సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఇకపై అదనపు కలెక్టర్ ప్రతిరోజూ ఆస్పత్రిని సందర్శించి సమస్యలు తెలుసుకుంటారని, రోజుకొకరు జిల్లా స్థాయి అధికారి ఆస్పత్రిని సందర్శించి మెరుగైన సేవలందించేందుకు సూచనలందిస్తారని, అదే సమయంలో రిజిస్టర్లను పరిశీలిస్తారని కలెక్టర్ ఈ సమావేశంలో స్పష్టంచేశారు. ఈ నిర్ణయానికి నాడు వైద్యులు, సిబ్బంది మద్దతు ప్రకటించారు. తదుపరి రోజు నుంచే ఆస్పత్రిలో సంస్కరణలు మొదలయ్యాయి. అయితే జిల్లా స్థాయి అధికారుల పరిశీలనపై అసంతృప్తితో ఉన్న వైద్యులు, సిబ్బంది కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో గురువారం సమ్మెకు దిగారు.

సేవల మెరుగుకే

ఆస్పత్రిలో సమ్మె చేస్తున్న వైద్యులు, సిబ్బంది వద్దకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలతో చర్చకు వచ్చిన అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర జిల్లా అధికారుల పరిశీలన అంశాలపై స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు. ప్రభుత్వాస్పత్రిలో శానిటేషన్, టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్ వంటి మౌలిక సదుపాయాల సేవలపై మాత్రమే జిల్లా అధికారులు పరిశీలన చేస్తారని, ఆ విధంగానే ఉత్తర్వులున్నాయని పేర్కొన్నారు. వైద్యులు, ప్రొఫెసర్ల పనితీరుపై ఎలాంటి పరిశీలనకు అధికారులకు ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. ఓపీ, స్పెషాలిటీ వార్డులకు సంబంధించి డాక్టర్ల హాజరు, రిజిష్టర్‌లను కేవలం పరిశీలిస్తారే తప్ప, ఇతర చర్యల అధికారం ఉండదని పేర్కొన్నారు. రేడియోలజీకి సంబంధించిన ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్, సిటీ స్కానింగ్, యసీజీ యూనిట్లను పరిశీలించి నివేదిక ఇస్తారని తెలిపారు. రోగులకు భోజనం, వంట గది పరిశుభ్రతను పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఓపీలో ఎంతమంది పేషెంట్లు వచ్చారు, డాక్టర్లు వారిని చూసి పంపడానికి ఎంత సమయం పడుతోంది? రోగులకు వీల్ చైర్లు, స్ట్రెచర్ ఏర్పాటు తదితర అంశాలే తప్ప, వైద్యుల గదుల్లో సేవలపై ఎలాంటి తనిఖీలుండవని, జోక్యాలుండవని ఆయన స్పష్టం చేశారు. ఆస్పత్రుల్లో సేవలు, వనరులు, వసతులు మరింత మెరుగుపరిచేందుకే తప్ప ఎవరిపైనా ఆధిపత్యం చెలాయించేందుకు కాదని ఆయన స్పష్టంగా వైద్యులకు వివరించారు.

2018లో వైద్య ఆరోగ్యశాఖ ఇచ్చిన మెమోపై అందరి దృష్టి

ఆస్పత్రిలో వైద్యుల విధులను, వైద్యసేవలను పరిశీలించే అధికారం, రికార్డులు, ఇతర రిజిస్టర్లను తనిఖీ చేసే అధికారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు తప్ప ఇతర అధికారులెవ్వరికీ లేదని వైద్యులు వాదిస్తున్నారు. దీంతో 2018లో వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇచ్చిన మెమోపై చర్చ మొదలైంది. వైద్య ఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖ 2018, ఏప్రిల్ 2న ఇచ్చిన మెమో ప్రకారం జాయింట్ కలెక్టర్ కంటే దిగువస్థాయి అధికారి ఎవ్వరూ పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో సాధారణ తనిఖీలు నిర్వహించకూడదు. అయితే అదే సమయంలో ఏవైనా ప్రత్యేక పరిస్థితుల్లో, అత్యవసర సమయాల్లో కలెక్టర్ ఏ అధికారికైనా ఆస్పత్రుల్లో తనిఖీలు చేసే అధికారం ఇవ్వవచ్చని, కలెక్టర్ల ద్వారా ప్రత్యేక అధికారం పొందితే సదరు అధికారులు ఆస్పత్రుల్లో రికార్డులు, రిజిస్టర్లు కూడా తనిఖీ చేయవచ్చని ఆ మెమోలో పేర్కొన్నారు. మొత్తంగా జిల్లా కేంద్రంలో తీవ్ర చర్చనీయాంశంగామారిన ఈ అంశాన్ని ప్రభుత్వం ఎలా పరిష్కరిస్తుందో? అటు అధికారులు, ఇటు వైద్యులు ఈ సమస్యను ఎలా అధిగమిస్తారో? తేలాల్సి ఉంది.

పొట్టకొట్టవద్దని కాళ్లపై పడిన శానిటేషన్ సిబ్బంది

ఆస్పత్రిని అదనపు కలెక్టర్ సందర్శించిన సమయంలో కొందరు శానిటేషన్ సిబ్బంది ఆయన కాళ్లపై పడి మొక్కే ప్రయత్నం చేశారు. తమను విధుల నుంచి అకారణంగా తొలగించారని, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. అదనపు కలెక్టర్ ఎంతవారించినా వినకపోవడంతో వారిని ఇతర ఉద్యోగులు పక్కకు తప్పించారు.



అదనపు కలెక్టర్ కాళ్లపై పడిన శానిటేషన్ సిబ్బంది

డీసీసీబీ రాజకీయానికి నేడు తెర



- చైర్మన్‌పై అవిశ్వాసానికి ఓటింగ్
- 15 మంది డైరెక్టర్ల మద్దతుతో నెగ్గుతామంటున్న కాంగ్రెస్
- క్యాంప్ నుంచి నేరుగా ప్రత్యేక బస్సులో సమావేశానికి రానున్న డైరెక్టర్లు
- అవిశ్వాసం చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డికి చాన్స్!

నల్లగొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో నెల రోజులుగా రాజకీయంగా చర్చనీయాంశంగా మారిన డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసానికి నేడు తెర పడనుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ చేతిలో ఉన్న ఒక్కో కీలక పదవిని హస్తగతం చేసుకుంటున్న కాంగ్రెస్ నేతలు తొలుత టెస్కాబ్‌పై దృష్టి సారించారు. టెస్కాబ్ పాలకమండలి చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టి, బీఆర్ఎస్ నేతలను పదవినుంచి దింపి, కాంగ్రెస్ నేతను చైర్మన్‌గా ఎన్నుకోవడంలో సఫలమయ్యారు. అదేబాటలో నల్లగొండ డీసీసీబీని కాంగ్రెస్ ఖాతాలో చేర్చాలనే డైరెక్టర్ల అభిమతాన్ని పరిశీలించిన జిల్లా మంత్రులు, కీలక నేతలు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నేతృత్వంలో డీసీసీబీ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు కార్యాచరణ చేపట్టారు. రాజగోపాల్‌రెడ్డి ప్రధాన అనుచరుడు డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో 14మంది డైరెక్టర్లను సమీకరించి, ఈనెల 9న బీఆర్ఎస్‌కు చెందిన ప్రస్తుత చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసులిచ్చారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే జిల్లా సహకార అధికారి నిర్ణయించిన మేరకు శుక్రవారం ఉదయం 11గంటలకు డీసీసీబీ ప్రత్యేక సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగనుంది. ఓటింగ్‌లో అవిశ్వాసం నెగ్గి చైర్మన్ మహేందర్‌రెడ్డి పదవీచ్యుతులవుతారని కాంగ్రెస్ శిబిరం ఆశాభావం వ్యక్తం చేస్తుంటే, అవిశ్వాసం వీగి తానే చైర్మన్‌గా కొనసాగుతాననే ధీమాలో మహేందర్‌రెడ్డి ఉన్నారు.

క్యాంపు నుంచి రానున్న డైరెక్టర్లు

తెలంగాణ సహకార చట్టం-1964 ప్రకారం డీసీసీబీ పాలకవర్గ సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేస్తే చైర్మన్ పదవీచ్యుతులవుతారు. నల్లగొండ డీసీసీబీలో 20మంది డైరెక్టర్ పోస్టులకు 19మంది నియమితులవగా, ఒక పోస్టు (కోఆప్షన్ సభ్యుడు) ఖాళీగా ఉంది. మొత్తం 14మంది డైరెక్టర్లు అవిశ్వాసానికి మద్దతుగా ఓటేస్తే అవిశ్వాసం నెగ్గనుంది. చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టిన డైరెక్టర్లు 14మంది నేరుగా ఒకేసారి ప్రత్యేక సమావేశానికి చేరుకుంటారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అవిశ్వాస నోటీసు ఇచ్చిన రోజు నుంచి ప్రత్యేక శిబిరానికి వెళ్లిన డైరెక్టర్లు కేరళ తదితర ప్రాంతాలకు యాత్రలకు వెళ్లారు. గురువారం సాయంత్రానికి వీరంతా హైదరాబాద్ చేరుకోనున్నారు. విదేశీ పర్యటనలో ఉన్న డీసీసీబీ వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి కూడా ఓటింగ్‌లో పాల్గొనే నిమిత్తం గురువారమే హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆయన కూడా ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా, అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేస్తారని తెలుస్తోంది. మొత్తం 15మంది డైరెక్టర్లు అవిశ్వాసానికి అనుకూలంగా ఉండడంతో తీర్మానం నెగ్గే అవకాశం ఉంది. ఈ 15 మందిలో ఆరుగురు ఇప్పటికీ బీఆర్ఎస్ నేతలేనని, వారంతా తనకే మద్దతుగా ఉన్నారని, వారి మద్దతుతో అవిశ్వాసం వీగుతుందని బీఆర్ఎస్ నేతలు చెబుతుండడం ఆసక్తికరంగా మారింది. ఊహించని పరిణామాలు సంభవిస్తే తప్ప అవిశ్వాసం నెగ్గడం ఖాయమని కాంగ్రెస్ నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అవిశ్వాసం నెగ్గితే కుంభంకే చాన్స్

అనుకున్న ప్రకారం అవిశ్వాస తీర్మానం నెగ్గితే, కొత్త డీసీసీబీ చైర్మన్ ఎన్నికను మరో పక్షం రోజుల్లోపే సహకారశాఖ అధికారులు నిర్వహిస్తారు. అవిశ్వాస ఘట్టానికి తెరదీయడంతో పాటు, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే ఆశీస్సులతో ఈ ప్రక్రియను ముందుండి నడిపిన కాంగ్రెస్ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికే చైర్మన్‌గా అవకాశం దక్కుతుందని తెలుస్తోంది. వైస్‌చైర్మన్ కూడా మద్దతుగా నిలవడంతో ఇప్పటికే 15మంది డైరెక్టర్ల సంఖ్యాబలం ఉందని, చైర్మన్ పీఠం కాంగ్రెస్ ఖాతాలో పడ్డట్లేనని, ఎన్నిక లాంఛనమేనని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

● నీట్ ఆందోళనలో ఎంపీ రఘువీర్‌రెడ్డి



జాతీయ యువజన కాంగ్రెస్ అధ్వర్యంలో ఢిల్లీలో గురువారం నిర్వహించిన పార్లమెంట్ ముట్టడిలో పాల్గొన్న ఎంపీ రఘువీర్‌రెడ్డి ●8లో..

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

దామరచర్ల, జూన్ 27: యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. పరిశ్రమలో జరుగుతున్న పనులను జెన్‌కో, బీహెచ్‌ఈఎల్ అధికారులను అడిగి తెలుసుకొని వారితో సమావేశమయ్యారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీచేశారు. 'ప్రజావాణి'లో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ జవహర్‌లాల్, ఆర్‌ఐ సతీష్, తదితరులు ఉన్నారు.



పవర్ ప్లాంట్‌లో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

జంటనగరాలకు నీటి సరఫరా పునరుద్ధరణ

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 27: హైదరాబాద్ జంటనగరాలకు తాగునీటి నిమిత్తం మండల పరిధిలోని కోదండపురం హెచ్‌ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ (జలమండలి) ప్లాంట్ ఫేజ్-2 నుంచి గురువారం నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు. కోదండపురం హెచ్‌ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ (జలమండలి) ప్లాంట్ ఫేజ్-2లో ఒక పంప్ ఎన్ఆర్‌వీ వాల్వ్ మరమ్మతులకు గురవడంతో బుధవారం మధ్యాహ్నం నుంచి జంట నగరాలకు నీటిసరఫరా నిలిచిపోయింది. దీంతో జలమండలి అధికారులు యుద్ధప్రాతిపదికన ప్లాంట్ ఫేజ్-2లో ఒక పంప్ ఎన్ఆర్‌వీ వాల్వ్ మరమ్మతులు చేపట్టి గురువారం మధ్యాహ్నం నీటి సరఫరాను పునరుద్ధరించారు. గతంలో మాదిరిగానే 8 మోటార్లను రన్ చేస్తూ మూడు ఫేజ్‌ల్లో నీటిని జంట నగరాలకు తరలిస్తున్నట్లు జలమండలి అధికారులు తెలిపారు.

పేదలకు భూమి పంపిణీ చేయాలి

నల్లగొండరూరల్, జూన్ 27: సమాజంలో అట్టడుగున ఉన్న పేదల అభివృద్ధితోపాటు, అసమానతలు తొలగాలంటే ప్రతీ కుటుంబానికి భూమి పంపిణీ చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. ఎంవీఎన్ ట్రస్ట్ భవనంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజకీయ శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో కేటాయింపులు చేసి దళిత, గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. నేడు రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం, ఫాంహౌస్ పేరుతో వేలాది ఎకరాల భూమి అభివృద్ధికి నోచుకోకుండా నిరుపయోగంగా మారిందన్నారు. కులం, మతం పేరుతో అసమానతలు సృష్టిస్తున్న రాజకీయ పార్టీలను ఒంటరి చేయాలన్నారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, నాయకులు రెమిడాల పరుష రాములు, కోడి రెక్క రాధిక, బొట్టు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు నాగార్జున

రెండో రోజూ రిజర్వాయర్ పనుల అడ్డగింత

మర్రిగూడ, జూన్ 27: చర్లగూడ రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనులను నర్సిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ముంపు బాధితులు రెండో రోజు గురువారం కూడా అడ్డుకున్నారు. చర్లగూడ రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనుల్లో భాగంగా నర్సిరెడ్డిగూడెం నుంచి శివన్నగూడకు వెళ్లి దారిని యంత్రాలతో పూడ్చి వేస్తుండటంతో నిరసన వ్యక్తం చేశారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనులు చేపడుతున్నారు. నర్సిరెడ్డిగూడెం నుంచి శివన్నగూడెం వెళ్లే రోడ్డును యంత్రాలతో రెండు రోజులుగా మూసివేసే ప్రయత్నంలో అధికారులు నిమగ్నమయ్యారు. దీంతో నర్సిరెడ్డిగూడెం గ్రామ బాధితులు గురువారం విషయం తెలుసుకుని పనులను అడ్డుకున్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు పనులు జరగకుండా అడ్డుకుని ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న సీఐ నవీన్‌కుమార్, ఇరిగేషన్ డీఈ కాశీం అక్కడికి చేరుకొని నిర్వాసితులతో మాట్లాడారు. బాధితులు వినకుండా పునరావాసం కల్పించేంత వరకు రోడ్డును తొలగించవద్దని డిమాండ్ చేశారు. స్పందించిన అధికారులు ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పక్క నుంచి దారి ఏర్పాటు చేస్తామని, అదేవిధంగా పునరావాసం కల్పించే విధంగా ఉన్నతాధికారులతో మాట్లాడుతామని వారు హామీ ఇచ్చారు. శివన్నగూడెం వెళ్లేందుకు కట్ట పక్క నుంచి నూతన దారిని ఏర్పాటు చేయడంతో నిర్వాసితులు ఆందోళన విరమించారు. అనంతరం పనులు కొనసాగాయి.



పనులను అడ్డుకున్న నిర్వాసితులతో మాట్లాడుతున్న అధికారులు

జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

నల్లగొండ రూరల్, జూన్ 27: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని, లేదంటే నిరవధిక సమ్మె చేయడానికై సిద్ధమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ హెచ్చరించారు. గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ధర్నా నిర్వహించి, అదనపు కలెక్టర్, డీపీవోకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని 844 గ్రామపంచాయతీల్లో 3,400 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఎండనక, వాననక చాలీచాలని వేతనాలతో వారు జీవనం సాగిస్తున్నారని, వచ్చే కాస్త వేతనం కూడ 17 నెలలుగా రాకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. కుటుంబాలను పోషించేందుకు అప్పు చేసి వడ్డీ భారం మోయలేకపోతున్నారని, అర్థాకలితో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది అధికారులు కార్మికుల తొలగించాలని కుట్రలు చేస్తున్నారని, ఇప్పటికైన కార్మికులను వేధించే అధికారులు వాటిని మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కష్టాలు తొలగుతాయని ఆశపడ్డ కార్మికుల నిరాశే మిగిలిందన్నారు. గతంలో ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోగా మరింతగా పెరిగాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రతకు ముప్పుగా ఉన్న మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, అర్హులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోలే సాంబయ్య యాదయ్య, నాంపల్లి చంద్రమౌళి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

30రోజుల్లో రూ.3.49కోట్ల ఆదాయం

● యాదగిరిగుట్టలో హుండీల కానుకల లెక్కింపు

భువనగిరి అర్బన్, జూన్ 27: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఖజానాకు 30రోజుల్లో రూ.3.49కోట్ల ఆదాయం సమకూరింది. మే 28 నుంచి ఈ నెల 26 తేదీ వరకు లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న భక్తులు హుండీల్లో సమర్పించిన మొక్కు కానుకలను గురువారం ఆలయ సిబ్బంది లెక్కించారు. రూ.3,49,47,177 నగదు, 166 గ్రాముల మిశ్రమ బంగారం, 4.750కిలోల వెండి, 1,163 అమెరికా డాలర్లు, ఐదు ఆస్ట్రేలియా డాలర్లు, 210 యూఏఈ దిరమ్స్, 400 నేపాల్ రూపీస్, 37సౌదీ అరేబియా రియాల్స్, 40 సింగపూర్ డాలర్లు, రెండు కువైట్ దినార్స్, 60కతార్ రియాల్స్, 200 ఒమన్ బైసాస్, 20పోలాండ్ జ్లోటీస్, 300మరిషస్ రూపీలు, 100శ్రీలంక రూపీలు కానుకల రూపంలో సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి పర్య వేక్షణలో లెక్కింపు నిర్వహించారు. లక్ష్మీనృసింహుడికి గురువారం నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు, సుదర్శన హోమం, శివాలయంలో రుద్రహవ నాలు వైభవంగా కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.20,97,264 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.


ప్రధానాలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

'బాటసారుల బావి'ని బాగు చేసుకుందాం

చౌటుప్పల్ రూరల్, జూన్ 27: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట జాతీయ రహదారి పక్కన ఉన్న పురాతన దిగుడు బావిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ శివనాగిరెడ్డి అన్నారు. గురువారం దిగుడు బావిని పరిశీలించారు. బాలంసాయి బావి అని పిలిచే దిగుడు మెట్ల బావిని 17వ శతాబ్ది కాలంలో కుతుబ్‌షాహీ రాజులు బాటసారుల కోసం నిర్మించారని తెలిపారు. 19వ శతాబ్దిలో బావికి మరమ్మతులు చేసినట్టు ఆనవాళ్లు కనిపిస్తున్నాయన్నారు. జాతీయ రహదారికి 100అడుగుల దూరంలో విజయవాడ వైపు దారిలో కుడి వైపున 70అడుగుల పొడవు, 45 అడుగుల వెడల్పు, 50అడుగుల లోతుతో తవ్వించారని తెలిపారు. బావి లోపలికి మెట్లు, మిగతా మూడు వైపుల రాతి గోడలు, మెట్లకు ఎదురుగా నీళ్ల తోడుకోవడానికి వ్యవసాయ అవసరాలకు వినియోగించడానికి మోటలను ఏర్పాటు చేశారని చెప్పారు. బావి చుట్టూ ఫెన్సింగ్, చారిత్రక వివరాలతో బోర్డును ఏర్పాటుచేసి, పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు.


తూప్రాన్‌పేట పరిధిలోని పురాతన దిగుడుబావి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మునగాల, మోత్కూరు, జూన్ 27: సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన తుమ్మల నాగేంద్రకుమార్(20) సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో వార్డెన్‌గా పని చేస్తున్నాడు. సూర్యాపేట నుంచి సొంత ఊరికి వచ్చేందుకు బైక్‌పై బయలు దేరాడు. మండలంలోని మాధవరం గ్రామ శివారులో గంగమ్మ గుడి సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌ను ఎర్టిగా కారు అతి వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో నాగేంద్ర తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. నాగేంద్రకుమార్ తల్లి సోమలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ అంజిరెడ్డి తెలిపారు.

రక్షణ కోసం ఏర్పాటు చేసిన బారీకేడ్‌ను ఢీకొని..

యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగు గ్రామ సమీపాన వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన బారీకేడ్‌ను ఢీకొని బైక్‌పై వెళుతున్న ఎం. తుర్కపల్లి గ్రామానికి చెందిన మాసంపల్లి పరశురాములు(37) గురువారం రాత్రి మృతి చెందాడు. వలిగొండ-తొర్రూర్ జాతీయ రహదారి నిర్మాణ పనులు నడుస్తున్నాయి. ఆ రోడ్డులో ఉన్న పాలడుగు రామాలయం వద్ద రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న బండను బ్లాస్టింగ్ పెట్టి తొలగిస్తున్నారు. దీంతో రోడ్డు పక్కన పెద్దపెద్ద రాళ్లు(గుండ్లు) ఉన్నాయి. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు అక్కడ బారీకేడ్లు ఏర్పాటు చేశారు. మోత్కూరులో వస్త్ర దుకాణం నడుపుతున్న ఎం.తుర్కపల్లి గ్రామానికి చెందిన మాసంపల్లి పరుశురాములు ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం వలిగొండ వెళ్లి తిరిగి మోత్కూరుకు బైక్‌పై వెళుతూ పాలడుగు వద్ద బారీకేడ్‌ను ఢీ కొట్టి పక్కనే ఉన్న బండరాయిపై పడి మృతిచెందాడు.

కుటుంబసభ్యులు మందలించారని..

భువనగిరి రూరల్, జూన్ 27: మద్యానికి బానిసైన వ్యక్తి కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని భువనగిరి- వంగపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గురువారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం బస్వాపురానికి చెందిన ఉడుత పాండు(42) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వెళ్లడంతో కుటుంబసభ్యులు మందలించారు. ఇంటి నుంచి వెళ్లిన పాండు భువనగిరి- వంగపల్లి రైల్వేస్టేషన్ల మధ్య 243/25-27 మైలు రాయి సమీపంలో గుర్తుతెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేహెడ్ కానిస్టేబుల్ తెలిపారు. పాండుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

అపెక్స్ చైర్మన్, వైస్ చైర్మన్‌కు సన్మానం


సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 27: నూతనంగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు చైర్మన్ రవీందర్‌రావు, వైస్ చైర్మన్ సత్తయ్యను డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో గురువారం సన్మానించారు. ఆబిడ్స్‌లోని కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశానికి హాజరైన సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో పలువురు డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

కోర్టు వివాదంలో ఉన్న భూమి మరొకరికి రిజిస్ట్రేషన్

● గుర్రంపోడు డిప్యూటీ తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు

గుర్రంపోడు, జూన్ 27: కోర్టు వివాదంలో ఉన్న భూమిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన గుర్రంపోడు డిప్యూటీ తహసీల్దార్‌పై నల్లగొండ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి గురువారం సస్పెన్షన్ వేటు వేశారు. బాధిత మహిళ బుధవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయగా విచారణ జరిపించి బాధ్యుడైన డిప్యూటీ తహసీల్దార్ ఫరీదుద్దీన్‌ను గురువారం సస్పెండ్ చేశారు. గ్రామానికి చెందిన జలగం లలితమ్మ పెద్ద కుమార్తె ఉజ్జిని కవితకు, చిన్న కుమార్తె ఇనుపాముల నాగమణికి ఒక్కొక్కరికి నాలుగు ఎకరాల 18గుంటల భూమిని దేవరకొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 2018లో రిజిస్ట్రేషన్ చేయించింది. చిన్న కుమార్తె నాగమణికి మ్యుటేషన్ జరగకపోవడంతో ఆ భూమి మళ్లీ లలితమ్మ పేరు మీదతోనే రికార్డులో ఉంది. అందులో ఎకరం భూమి మిస్సింగ్ సర్వే నెంబరు కింద ఉండగా, మిగతా సర్వే నెంబరు 1206/2/1లో మూడు ఎకరాల 18గుంటల భూమి తన తల్లి దగ్గర నుంచి కొనుగోలు చేసినట్లుగా కుమారుడు జలగం చంద్రశేఖర్‌రావు 2021లో మధ్యవర్తులను పెట్టుకొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తాము రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమిని తమ ప్రమేయం లేకుండా రెండోసారి రిజిస్ట్రేషన్ చేయడంపై అక్కచెల్లెళ్లు 2021లో కోర్టును ఆశ్రయించారు. ఆ భూమిని యథాతథ స్థితిలో ఉంచాలని కోర్టు రెవెన్యూ అధికారులను ఆదేశించింది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి ఇదే భూమిని గతేడాది చంద్రశేఖర్‌రావు తమ సమీప బంధువు కల్లెం మంజుల అనే మహిళ కొనుగోలు చేసినట్లు మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించాడు. అదే భూమిని ఈ నెల 26వ తేదీన కల్లెం మంజుల పేరును తొలగించిన జలగం చంద్రశేఖర్‌రావు తన కుమారుడు జలగం మధుకు ఆ భూమిని తిరిగి రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ వ్యవహారంలో సుమారు రూ.4లక్షల మేరకు చేతులు మారినట్లుగా అనుమానిస్తున్నారు. గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లకు బాధ్యులైన తహసీల్దార్‌పై కూడా చర్య తీసుకోవాలని బాధిత మహిళలు కోరుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బాధితులు బుధవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కోర్టు వివాదంలో ఉన్న భూమిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన గుర్రంపోడు డిప్యూటీ తహసీల్దార్‌పై విచారణ నిర్వహించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ గురువారం ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.

అమ్మనబోలులో 250 ట్రాక్టర్ల ఇసుక నిల్వలు స్వాధీనం

నార్కట్‌పల్లి, జూన్ 27: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలులో భారీ ఇసుక డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నార్కట్‌పల్లి ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అమ్మనబోలు గ్రామంలో అమ్మనబోలు-పొడిచేడి మూసీ వాగు నుంచి అక్రమంగా తరలించి వివిధ ప్రదేశాల్లో పెద్ద ఎత్తున ఇసుకను డంపింగ్ చేశారన్న విశ్వసనీయ సమాచారం మేరకు తమ పోలీస్ సిబ్బంది, మండల రెవెన్యూ పరిశీలకుడు తరుణ్‌తో కలిసి గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించామని తెలిపారు. గ్రామంలో వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వచేసిన 250 ట్రాక్టర్ల ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. అమ్మనబోలు పరిసర గ్రామాల్లోని వివిధ ప్రదేశాల్లో డంప్ చేసిన ఇసుక నిల్వలను గుర్తించామని తెలిపారు. వారిని గుర్తించి కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో సుమారు 6 నెలలుగా డంపింగ్ చేసినట్లు తెలిపారు. అమ్మనబోలు మూసీవాగు నుంచి ఇసుక అక్రమ రవాణాపై ఆరోపణలు వచ్చాయి. ఇసుకను రహస్య ప్రాంతానికి తరలించి ఓ చోట డంపింగ్ చేసి హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.


అమ్మనబోలులో ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

గంజాయి రవాణా ముఠా అరెస్టు

● 2.1కిలోల గంజాయి స్వాధీనం

మిర్యాలగూడ, జూన్ 27: గంజాయి రవాణా చేస్తున్న అంతర్రాష్ట ముఠాను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 2.1 కేజీల గంజాయి, 3,600 మత్తు ట్యాబ్లెట్లు(పెయిన్ కిల్లర్), మొబైల్ ఫోన్, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ కార్యాలయంలో గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు వివరాలు వెల్లడించారు. ఏపీ రాష్ట్రానికి చెందిన బత్తుల కుమారి, మిర్యాలగూడ పట్టణానికి చెందిన చలసాని కోటేశ్వరరావు, సంపత్ అశోక్, నేనావత్ అశోక్, నల్లగొండకు చెందిన మహ్మద్ షంషేర్ అలియాస్ సూఫీ ముఠాగా ఏర్పడి గంజాయి సరఫరా చేస్తున్నారు. మాచర్లకు చెందిన బత్తుల కుమారి వద్ద రూ.15వేలకు కొనుగోలు చేసిన వారు మిర్యాలగూడ పట్టణ, పరిసర ప్రాంతాల్లో రెట్టింపు ధరకు విక్రయాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో టూటౌన్ సీఐ నాగార్జున సిబ్బందితో గురువారం మిర్యాలగూడ పట్టణంలోని బైపాస్‌రోడ్డులో పెట్రోలింగ్ చేస్తుండగా పవన్ మోటార్స్ వెనుక భాగంలో కొందరు అనుమానాస్పదంగా కన్పించారు. వారిని అదుపులోకి తీసుకుకొని విచారించగా గంజాయి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారని డీఎస్పీ తెలిపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. గంజాయి విక్రయ ముఠాను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని అభినందించారు.

మూసీ నీటిమట్టం 637అడుగులు

కేతేపల్లి, జూన్ 27: మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 637అడుగులు ఉంది. ఎగువ మూసీ నది నుంచి ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. దీంతో మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 637.45అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతోంది. వేసవిలో హైదరాబాద్ జంటనగరాలతో పాటు ఎగువ మూసీ పరీవాహక ప్రాంతాల నుంచి నిరాటంకంగా కొనసాగిన ఇన్‌ఫ్లోతో గత ఏప్రిల్ మొదటి వారంలో ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు సాగునీటి విడుదల నిలిపి వేసే నాటికి 618అడుగుల గరిష్ఠ స్థాయికి చేరింది. ప్రాజెక్టు నీటిమట్టం ఒక్కో అడుగు పెరుగుతూ ఇటీవల 637.45అడుగులకు చేరింది. మూసీ నది ఎగువ, పరివాహక ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో 15రోజులుగా ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది.

సెన్సెక్స్ 79,000 పైకి..
24,000 స్థాయికి నిఫ్టీ

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- నాలుగో రోజూ లాభాల బాటలో మార్కెట్
- రూ.438.41 లక్షల కోట్లకు మదుపరుల సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం రికార్డుల మోత మోగింది. వరుసగా నాలుగో రోజూ ర్యాలీ తీసిన ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 79,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 24,000 మార్క్‌ను దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 721.78 పాయింట్లు ఎగబాకి 79,396.03 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 568.93 పాయింట్ల లాభంతో 79,243.18 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 218.65 పాయింట్ల వృద్ధితో 24,087.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 175.70 పాయింట్ల లాభంతో 24,044.50 వద్ద కొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ మంగళవారం 78,000 స్థాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం రెండు ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్ల మేర పుంజుకుంది. గత నెల 24న తొలిసారిగా 23,000 మైలురాయిని తాకిన నిఫ్టీ, కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో మరో 1,000 పాయింట్లు వృద్ధిని కనబరిచింది. మార్కెట్ జైత్రయాత్రలో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.438.41 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు (2.63 శాతం) పుంజుకోగా.. మార్కెట్ సంపద రూ.3.93 లక్షల కోట్లు పెరిగింది.

వచ్చే నెల 3 నుంచి ఎమ్‌క్యూర్ ఫార్మా ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన ఎమ్‌క్యూర్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చేనెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. వచ్చేనెల 10న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది.

జేపీ మోర్గాన్ బాండ్ ఇండెక్స్‌లోకి భారత ప్రభుత్వ సెక్యూరిటీలు

భారత ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్) శుక్రవారం నుంచి జేపీ మోర్గాన్-ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లో భాగం కానున్నాయి. వచ్చే 10 నెలల (2024 జూన్ 28 నుంచి 2025 మార్చి 31) కాలంలో ఈ సూచీలో చేరనున్నాయి. నెలకు ఒక శాతం చొప్పున పది నెలల్లో గరిష్ఠంగా సూచీలో 10 శాతం వెయిటేజీ వరకు భారత జీ-సెక్‌లను సూచీలో చేర్చనున్నారు. తద్వారా వచ్చే పది నెలల్లో మన ప్రభుత్వ బాండ్లలోకి కనీసం 2,000-2,500 కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు రావచ్చని అంచనా. దాంతో మన జీ-సెక్‌ల రేట్లు తగ్గడంతో ప్రభుత్వానికి రుణ సమీకరణ వ్యయం కూడా తగ్గనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా

రూ.1,900 కోట్లతో 23% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ రంగంలో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. తాజాగా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్.. చెన్నై కేంద్రంగా ఉన్న ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 22.77 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1,889.27 కోట్లు చెల్లించింది. డీమార్ట్ ప్రమోటర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబ సభ్యుల నుంచి అల్ట్రాటెక్ 2 బ్లాక్ డీల్స్ ద్వారా ఈ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం మొదటి బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.265 చొప్పున, రెండో బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.285 చొప్పున చెల్లించింది.

ముందు చూపుతోనే: ఇది కేవలం పెట్టుబడి లాభాల కోసం జరిపిన కొనుగోలు అని అల్ట్రాటెక్ చెబుతోంది. అయితే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఇండియా సిమెంట్స్‌ని ఎలాగైనా కైవసం చేసుకునే వ్యూహంతోనే అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 23 శాతం వాటా కొనుగోలు చేసిందని భావిస్తున్నారు. గతంలో బీవీ రాజు నిర్వహణలోని రాశి సిమెంట్, విష్ణు సిమెంట్ టేకోవర్ కోసం గతంలో ఇండియా సిమెంట్స్ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. ముందు పెట్టుబడి లాభాల కోసమే అంటూ, ఈ రెండు కంపెనీల ఈక్విటీలో కొంత వాటా కొనుగోలు చేసింది. తర్వాత బీవీ రాజు బంధువుల నుంచి మరింత వాటా కొనుగోలు చేసి ఈ రెండు సంస్థలను కైవసం చేసుకుంది. ఇండియా సిమెంట్ ఈక్విటీలో ఇప్పటికీ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్‌కు, ఆయన నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు 28 శాతం వాటా ఉంది. మిగతా 49 శాతం వాటా రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరుల చేతుల్లో ఉంది.

జియో సేవలు మరింత ప్రియం

27% వరకు టారిఫ్‌ల పెంపు

జూలై 3 నుంచి అమల్లోకి

స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు

జియో బాటలో మిగతా టెల్కోలు!



న్యూఢిల్లీ: టెలికాం రంగంలో టారిఫ్‌ల పెంపు మళ్లీ ప్రారంభమైంది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియో ఇందుకు నాంది పలికింది. తన ప్లాన్స్‌లోని అన్ని మొబైల్ టారిఫ్స్‌ను 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు జూలై 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. రెండున్నర సంవత్సరాల తర్వాత జియో తన మొబైల్ టారిఫ్స్‌ను పెంచడం ఇదే మొదటిసారి. '5జీ, ఏఐ టెక్నాలజీల్లో పెట్టుబడుల ద్వారా స్థిరమైన అభివృద్ధి కోసం టారిఫ్‌లు పెంచుతున్నాం' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా అన్‌లిమిటెడ్ ఉచిత 5జీ సర్వీసులను కొన్ని ప్లాన్స్‌లోని కస్టమర్లకే కంపెనీ పరిమితం చేసింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే రిలయన్స్ జియో టారిఫ్‌లు పెంచడం విశేషం. దీంతో మిగతా టెలికాం కంపెనీలు త్వరలోనే రిలయన్స్ జియోను అనుసరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెంపు ఇలా: ప్రస్తుతం రూ.15గా ఉన్న ఒక జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ ధరను రూ.19కు (27 శాతం) పెంచింది. 75 జీబీ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్ టారిఫ్‌ను రూ.399 నుంచి రూ.449కి పెంచేసింది. ఇక అత్యంత ప్రజాదరణ పొంది 84 రోజులు చెల్లుబాటయ్యే రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ టారిఫ్‌ను రూ.799కి (20 శాతం) పెంచేసింది. ఏడాది పాటు చెల్లుబాటయ్యే వార్షిక పథకాల టారిఫ్‌లనూ రూ.1,559 నుంచి రూ.1,899కి, రూ.2,999 నుంచి రూ.3,599కి పెంచింది. రోజుకి 2 జీబీ లేదా అంతకంటే ఎక్కువ జీబీ ప్లాన్స్‌లో ఉన్న ఖాతాదారులకు అపరిమిత 5జీ డేటా లభిస్తుందని తెలిపింది.

ఉచితంగా రెండు యాప్స్

టారిఫ్‌ల పెంపుతో పాటు తన ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో రెండు ప్రత్యేక యాప్స్‌ని అందుబాటులోకి తెచ్చింది. జియో సేఫ్, జియో ట్రాన్స్‌లేట్ అనే ఈ రెండు యాప్స్ ఏడాది పాటు జియో ప్రస్తుత ఖాతాదారులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందులో జియో సేఫ్ యాప్ ద్వారా సురక్షితంగా కాల్స్, మెసేజ్‌లు, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్‌తో సహా అనేక పనులు చేయవచ్చని తెలిపింది. ఇక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత జియో ట్రాన్స్‌లేటర్ యాప్ ద్వారా వాయిస్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, టెక్స్ట్, ఇమేజ్‌లను వివిధ భాషల్లోకి తర్జుమా చేయవచ్చు. కొత్తగా చేరే ఖాతాదారులు మాత్రం ఈ యాప్స్‌కి నెలకు రూ.99 నుంచి రూ.199 వరకు చెల్లించాలి.

2024-25లో ఫార్మా ఎగుమతుల్లో 10% వృద్ధి

రూ.2.6 లక్షల కోట్లుగా నమోదయ్యే చాన్స్
ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3,100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు) ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కావచ్చని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఫార్మా ఎగుమతులు 2,785 కోట్ల డాలర్లు (రూ.2.32 కోట్లు)గా ఉన్నాయని, 2024-25లో ఇవి 10-12 శాతం వరకు వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల కాలంలో ఫార్మా ఎగుమతులు 8.85 శాతం వృద్ధితో 435 కోట్ల డాలర్ల నుంచి 473 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఎగుమతులపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ నిర్దేశిత ఎగుమతుల లక్ష్యాలను చేరుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆఫ్ పేటెంట్ ఔషధాలతో అపార అవకాశాలు

2023 నుంచి 2029 వరకు అంతర్జాతీయంగా 15 బ్లాక్‌బస్టర్ ఔషధాల పేటెంట్ గడువు తీరిపోనుందని, ఈ ఔషధాలతో భారత ఫార్మా పరిశ్రమ అపారమైన అవకాశాలు దక్కించుకునే వీలుందని ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ ఆఫ్-పేటెంటెడ్ ఔషధాల విలువ దాదాపు 11,200 కోట్ల డాలర్లుగా ఉందని, ఇందులో భారత కంపెనీలు 1,000 కోట్ల డాలర్ల వరకు అవకాశాలను అందుకునే అవకాశం ఉందన్నారు. కాగా ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు.. అంతర్జాతీయ రెగ్యులేటరీ సంస్థల నుంచి కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, చాలా వరకు ఇవి నాణ్యతకు సంబంధించినవిగా ఉంటున్నాయని వివరించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఫార్మెక్సిల్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నట్టేట ముంచే పెట్టుబడి సలహాదారులకు చెక్!

- సెబీ నియంత్రణలోకి ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్స్
- అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కొత్త నియమావళి
- డెరివేటివ్స్‌లో స్టాక్స్ ఎంట్రీకి కఠిన నిబంధనలు
- సెబీ బోర్డులో పలు కీలక నిర్ణయాలు



ముంబై: డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆర్థిక పెట్టుబడులపై సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల (ఫిన్‌ఫ్లుయెన్సర్స్)ను నియంత్రించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిర్ణయించింది. అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్ కోసం నియమావళిని విడుదల చేసింది. అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో సెబీ నమోదిత కంపెనీలు, వారి ఏజెంట్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కాకుండా నిషేధం విధించింది. గురువారం సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించింది. పక్షపాతంతో, పక్కదోవ పట్టించే సలహాలిచ్చే ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ మండలి తాజా చర్యలు చేపట్టింది. ఎందుకంటే, పెట్టుబడులు, మదుపు కోసం ఫిన్‌ఫ్లుయెన్సర్ల సలహాలపై ఆధారపడే చిన్న మదుపరుల సంఖ్య గడిచిన కొన్నేళ్లలో భారీగా పెరిగింది. సెబీ కొత్త నియమావళి ఫిన్‌ఫ్లుయెన్సర్లను వారిచ్చే సలహాలకు బాధ్యులుగా, జవాబుదారీగా చేయనుంది. అంతేకాదు, సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు (ఐఏ), రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ) తమ క్లయింట్ల నుంచి రుసుము వసూలు చేసేందుకు క్లోజ్డ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా నియంత్రణ మండలి నిర్ణయించింది.

అప్పు చేసి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్: బుచ్

ఏదైనా కంపెనీ షేరును డెరివేటివ్ ట్రేడింగ్‌లో చేర్చడం లేదా వైదొలగడానికి సంబంధించిన అర్హత నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. నిత్యం తక్కువ టర్నోవర్ కలిగిన స్టాక్స్‌ను ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగం నుంచి ఏరివేసేందుకు ఇది దోహదపడనుంది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌పై సమీక్ష జరిపేందుకు సెబీ 15 మంది సభ్యులతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు కోణాల్లో (మార్కెట్ అభివృద్ధి, ఇన్వెస్టర్ల సొమ్ముకు రక్షణ, పొంచి ఉన్న ముప్పులు) ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను సమీక్షించనుందని బోర్డు భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర పెరగడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. చిన్న ఇన్వెస్టర్లు అప్పు చేసి మరీ ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్నారని, కుటుంబ పొదుపు సొమ్మునూ కరిగించేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	94,500 ▼
ముంబై	71,391 ▲	65,394 ▲	87,043 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	520
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

ఢిల్లీలోని ఒవైసీ ఇంటినేమ్ ప్లేట్‌పై
సిరా చల్లి పారిపోయిన దుండగులు

» ఒవైసీ మండిపాటు.. అమిత్‌షా చేయిస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఢిల్లీలోని ఇంటి ఆవరణలో ఉన్న నేమ్ ప్లేట్‌పై ఇద్దరు దుండగులు సిరా చల్లి పారిపోయారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను ఎక్స్‌లో పంచుకుంటూ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని నిరోధించడంలో ఢిల్లీ పోలీసుల విఫలం అయ్యారని మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యవేక్షణలోనే ఇవి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎంపీలకు తగిన భద్రత ఉంటుందో లేదో స్పష్టం చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రశ్నించారు. ఇంటిపై సిరా చల్లడం, రాళ్లు రువ్వి పారిపోవడం పిరికిపందల చర్య అని, ఇలాంటి వాటికి తాను భయపడనని స్పష్టం చేశారు. ధైర్యం ఉంటే నేరుగా తనను ఎదుర్కోవాలని ఒవైసీ సవాల్ విసిరారు.

బియ్యం ఇచ్చేందుకు..
మిల్లర్లకు మరో 90 రోజుల సమయం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని బియ్యం(సీఎంఆర్) ఇవ్వని మిల్లర్లకు మరో 90 రోజుల పాటు గడువు ఇస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం జీవో జారీ చేశారు. ఈ పొడిగింపు 2019-20, 2020-21 యాసంగి సీజన్, 2021-22 వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలం సీజన్ సీఎంఆర్ బకాయిలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సీఎంఆర్ ధరకు 125 శాతం లేదా 12 శాతం వార్షిక వడ్డీ రేటు.. ఇందులో ఏది ఎక్కువైతే అది నగదు రూపంలోనైనా, బియ్యం రూపంలో(స్టేట్ పూల్‌కు)నైనా రికవరీ చేయవచ్చని పేర్కొన్నారు. గడువులోగా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మిల్లర్లకు ధాన్యం మిల్లింగ్‌కు అనుమతి ఇవ్వకుండా అనర్హత వేటు వేస్తామని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్, అన్ని జిల్లాల మేనేజర్లు, పౌర సరఫరాల సంస్థ అధికారుల సమన్వయంతో ఈ రికవరీ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

నిబ్రస్ డ్రోన్లకు డీజీసీఏ ఆమోదం

» భూ సర్వే అవసరాలు తీర్చేలా ఆధునిక ఫీచర్లు



హైదరాబాద్ సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అధునాతన ఫీచర్లతో భూమి సర్వేకు నిబ్రస్ టెక్నాలజీస్ సంస్థ రూపొందించిన డ్రోన్ సర్వేయాన్ వి1కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆమోద ముద్ర వేసింది. 1.99 కిలోల బరువుండే ఈ డ్రోన్‌కు అధిక తరంగ దైర్ఘ్యం (హై రెజుల్యూషన్) కలిగిన 23 మెగా పిక్సల్ కెమెరా అమర్చి ఉంటుంది. ఫలితంగా అత్యంత స్పష్టమైన చిత్రాలు, డేటాను సేకరించగలదు. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో గాల్లో ఎగరగలదు. వేగంగా విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీ రంగంలో తమ ఉనికి చాటుకునేలా అధునాతన ఉత్పత్తులను రూపొందిస్తున్నట్లు నిబ్రస్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శుభం భరన్వాల్ తెలిపారు. సర్వే పరిశ్రమలో సర్వేయాన్ వీ1డ్రోన్ విప్లవాత్మక మార్పులకు కారణమవుతుందనే విశ్వాసం వ్యక్తంచేశారు.

ఆడపిల్ల వద్దంటూ..
ఏడో నెలలో అబార్షన్

తల్లి ప్రాణానికే ముప్పని వైద్యులు చెప్పినా వినని భర్త

» ఆర్ఎంపీ సహాయంతో భార్యకు మామిడితోటలో గర్భస్రావం చేయించి ఆమె ప్రాణాలు బలిగొన్న వైనం
» సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో విషాద ఘటన


సూర్యాపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు


సుహాసిని (ఫైల్)

హుజూర్‌నగర్ / సూర్యాపేట క్రైం, జూన్ 27: భార్య కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని తెలిసి గర్భస్రావం చేయించేందుకు సిద్ధపడ్డాడా భర్త! ఏడో నెలలో అబార్షన్ చేస్తే తల్లిప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరించినా అతడి మనసు మారలేదు! తెలిసిన ఆర్ఎంపీ సాయంతో.. ఓ వైద్యుణ్ని సంప్రదించి.. అతడి మామిడితోటలో దొంగచాటుగా అబార్షన్ చేయించాడు. ఈ క్రమంలో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయిందా అభాగ్యురాలు!! సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిందీ విషాదం. తమకు తెలియకుండా తమ కుమార్తెకు అల్లుడు ఆపరేషన్ చేయించడాన్ని ఆగ్రహిస్తూ తల్లిదండ్రులు గురువారం సూర్యాపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామపంచాయతీ ఆవాసం రాముతండాకు చెందిన సుహాసిని(26)కి చివ్వెంల మండలం ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌తో ఆరేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హరిసింగ్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాదిన్నర కిందట సుహాసిని గర్భవతి కాగా.. లింగనిర్ధారణ పరీక్ష చేయించాడు. ఆమె గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేయించాడు. ఇటీవల ఆమె మరోసారి గర్భం దాల్చడంతో మళ్లీ స్కానింగ్ తీయించాడు. కడుపులో ఉన్నది ఆడశిశువు అని నిర్ధారణ కావడంతో మరోసారి అబార్షన్ చేయించేందుకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యురాలు.. ఏడు నెలల గర్భం ఉన్న పరిస్థితుల్లో అబార్షన్ చేయడం వీలు పడదన్నారు. అయినప్పటికీ హరిసింగ్ ఊరుకోలేదు. ఓ ఆర్ఎంపీ సహాయంతో భార్య సుహాసినిని తీసుకుని హుజూర్‌నగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. ఆమెకు అబార్షన్ చేసేందుకు ఓ వైద్యుడిని ఒప్పించారు. హుజూర్‌నగర్ పట్టణ సమీపంలో.. ఆ వైద్యుడికి చెందిన మామిడి తోటలో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఈ నెల 25వ తేదీన రాత్రిపూట సుహాసినికి అబార్షన్ చేస్తుండగా తీవ్ర రక్తస్రావమైంది. పరిస్థితి విషమిస్తుండటంతో ఆమెను తొలుత కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యులు పరిస్థితి బాగాలేదని చెప్పడంతో.. ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడినుంచి తిరిగి సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపకుండా అదే రోజు మృతదేహాన్ని ఎంజీనగర్‌తండాకు తీసుకెళ్లాడామె భర్త.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..

సుహాసిని మృతి విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఎంజీనగర్ తండాకు వెళ్లారు. తమకు తెలియకుండా తమ కుమార్తెకు ఎలా ఆపరేషన్ చేయిస్తావంటూ అల్లుడితో గొడవపడ్డారు. ఆపరేషన్ చేసిన వైద్యుడిని నిలదీసేందుకు సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యుడు లేకపోవడంతో సిబ్బందితో గొడవపడ్డారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సూర్యాపేట పట్టణానికి వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రిలో సుహాసిని మృతదేహాన్ని ఉంచారు. అనంతరం.. సుహాసిని భర్తపైన, ఆపరేషన్ చేసిన వైద్యుడిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వారి ఫిర్యాదు తీసుకుని.. బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆ తర్వాత.. చట్టవిరుద్ధంగా అబార్షన్ చేసిన హుజూర్‌నగర్ వైద్యుడితో పాటు, ముగ్గురు ఆర్ఎంపీలు, ఆసుపత్రి అటెండర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

'శ్రీశైలం'లో యూనిట్-4కు
మరమ్మతులు!

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జెన్‌కో చర్యలు

త్వరలో టెండర్లు నిర్వహించేందుకు కసరత్తు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలోని 4వ యూనిట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు జెన్‌కో చర్యలు చేపట్టింది. శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో 150 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన 6 యూనిట్లు ఉన్నాయి. 2020 ఆగస్టు 20న జలవిద్యుత్ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా.. తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ప్రమాదంలో కొన్ని యూనిట్లు పూర్తిగా, మరికొన్ని యూనిట్లు పాక్షికంగా కాలిపోయాయి. 4వ యూనిట్‌కే అత్యధిక నష్టం వాటిల్లింది. దీనికి జర్మనీ కంపెనీ వైత్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. గత ఏడాది జూలైలో 80 గంటలపాటు విద్యుదుత్పత్తి చేసిన తర్వాత ఫాల్ట్ రావడంతో 4వ యూనిట్ మళ్లీ కాలిపోయింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లోనే కాలిపోయినందున ఒప్పందం ప్రకారం సొంత ఖర్చుతో మరమ్మతు చేయాలని 'వైత్' గ్రూపును జెన్‌కో కోరగా, ఆ సంస్థ నిరాకరించింది. 4వ యూనిట్‌కు ఇతర మరమ్మతులు నిర్వహించడం వల్లే ఫాల్ట్ ఏర్పడిందని, తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఏడాదిపాటు ఈ వివాదం నడవడంతో మరమ్మతుల అంశం మరుగున పడిపోయింది. అయితే, ఈ విషయమై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. మరమ్మతులు చేపట్టాలని జెన్‌కోను ఆదేశించింది. మరమ్మతులకు రూ.3కోట్లు మాత్రమే ఖర్చు కానుండగా, అంతకు ఎన్నో రెట్లు విలువైన జల విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చన్న అంశాన్ని ప్రస్తావించింది. దీంతో మళ్లీ కొత్తగా టెండర్లు నిర్వహించడానికి జెన్‌కో యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. అయితే, మరమ్మతులు పూర్తయి 4వ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడానికి కనీసం మూడు నెలలు పడుతుందని, ఆలోగా కృష్ణాలో వరదలు తగ్గుముఖం పడుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అమెరికాలో తెలుగోళ్ల హవా

» అగ్రరాజ్యంలో పెరుగుతున్న మనోళ్ల సంఖ్య
» 8 ఏళ్లలో నాలుగు రెట్ల పెరుగుదల
» 2016లో 3.2 లక్షలు.. 2024లో 12.3 లక్షలు
» ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగుది 11వ స్థానం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తెలుగు.. వీధిలో తెలుగు.. యునివర్సిటీలో తెలుగు.. కార్యాలయంలోనూ తెలుగే. ఇదేదో ఆంధ్రానో, తెలంగాణో అనుకుంటే పొరబడినట్టే! అగ్రరాజ్యం అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవలికాలంలో కనిపిస్తున్న పరిస్థితి ఇది. ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో నిలిచింది. అమెరికాలో ఎక్కువగా మాట్లాడే భారతీయ భాషల జాబితాలో మనకన్నా ముందు హిందీ, గుజరాతీ ఉన్నాయి. కొన్నాళ్లుగా.. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఇతర దేశాల నుంచి అమెరికాకు చేరుకుంటున్నవారిలో తెలుగువారి జనాభా గణనీయంగా పెరుగుతోంది. అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని అధికారికంగా స్పష్టం చేస్తున్నాయి. 2016తో పోలిస్తే 2024లో అమెరికాలో ఉంటున్న తెలుగువారి జనాభా నాలుగింతలు పెరిగిందని ఇటీవలే విడుదలైన యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం..

- 2016లో అమెరికాలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 3.2 లక్షలు ఉండగా..ఇప్పుడది 12.3 లక్షలకు చేరింది.
- తెలుగు జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో క్యాలిఫోర్నియా ప్రథమస్థానంలో ఉంది. అక్కడ 2 లక్షల మంది తెలుగువారున్నారు. తర్వాతటెక్సస్(1.5 లక్షలు), న్యూజెర్సీ(1.1లక్షలు), ఇల్లినాయ్(83 వేలు), వర్జీనియా(78వేలు), జార్జియా(52 వేలు) ఉన్నాయి.
- అమెరికాకు ఏటా వచ్చే మొత్తం విదేశీ విద్యార్థుల్లో తెలుగు విద్యార్థుల వాటా దాదాపు 13 శాతం.
- ఉపాధి కోసం వెళ్లేవారి సంఖ్యలోనూ ఏటా వృద్ధి నమోదవుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ నుంచి అత్యధికులు అమెరికాకు వెళ్తుండగా.. వీరిలో సింహభాగం తెలుగు రాష్ట్రాల నుంచే ఉంటున్నారు.
- అమెరికాలోని అనేక ప్రముఖ వర్సిటీల్లోని విదేశీ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల వాటా పెరుగుతోంది. కెంట్ స్టేట్ వర్సిటీలో మనోళ్ల ప్రవేశాలు ఎక్కువగా ఉండడంతో 'విద్యార్థులకు స్వాగతం' అంటూ తెలుగులో ఆహ్వానం పలకడం పట్ల మన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- ఏటా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు, 10 వేల మందికి పైగా హెచ్1బీ వీసాపై అమెరికాకు చేరుకోవడమే అక్కడ మన హవా ఇంతగా పెరడగానికి ప్రధాన కారణం. ఇండియన్ మొబిలిటీ రిపోర్ట్-2024 ప్రకారం.. చదువుకోవడానికి అమెరికా వెళ్తున్న భారతీయ విద్యార్థుల్లో మన తెలుగువారి వాటా ఏకంగా 12.5 శాతం!!

మాతృభాష	2010	2021	వృద్ధి (శాతం)
తెలుగు	217641	459836	111.00%
తమిళం	181698	341396	88.00%
బెంగాలీ	221872	403024	82.00%
నేపాలీ, మరాఠీ, ఇండో-ఆర్యన్ భాషలు	275694	447811	63.00%
హిందీ	609395	864830	42.00%
మళయాళం, కన్నడ, ఇతర ద్రావిడ భాషలు	197550	280188	42.00%
ఉర్దూ	388909	507972	31.00%
పంజాబీ	243773	318588	31.00%
గుజరాతీ	356394	436909	23.00%

వృద్ధిరేటులో మనమే..

అమెరికాలో ఉండే అన్ని దేశాలవారు, జాతులవారు బయట మాట్లాడేది ఆంగ్లమైనా.. ఇంట్లో మాట్లాడేది మాత్రం మాతృభాషే. అలా ఆ దేశంలో ఉంటున్న భారతీయుల్లో.. ఇంట్లో మాతృభాష మాట్లాడే వారి సంఖ్య పెరుగుదలలో తెలుగువారిదే అగ్రస్థానం. 2010లో అక్కడ 2.17 లక్షల మంది ఇంట్లో తెలుగు మాట్లాడుతుండగా.. 2021 నాటికి వారి సంఖ్య 111 శాతం వృద్ధి రేటుతో 4.59 లక్షలకు చేరింది

రేషన్‌కార్డు దరఖాస్తులు పెండింగ్‌లో లేవు

నల్లగొండ, జూన్ 27: జిల్లాలో కొత్త రేషన్ కార్డులకు కార్యాలయంలో దరఖాస్తులు పెండింగ్‌లో లేవని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 2021 సంవత్సరం జూలై నెలలో ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో 11,395 కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డుల నుంచి మీ సేవలో ఎలాంటి దరఖాస్తులు నమోదు కాలేదన్నారు. గతంలో మీసేవల ద్వారా రేషన్‌కార్డుల కోసం 6,438 మంది తమ దరఖాస్తులను నమోదు చేసుకున్నారని, వాటి ఆమోదం కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ కాగానే నిబంధనల ప్రకారం మంజూరు చేస్తామని తెలిపారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలి


క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), జూన్ 27: ఆరోగ్యవంతమైన సమాజం క్రీడా మైదానాల నుంచే ప్రారంభమవుతుందని ఎమ్మెల్సీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని బోయగూడెం గ్రామంలో గురువారం ఎంసీకేఆర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల వల్ల క్రీడాకారులకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వం అలవడుతుందని అన్నారు. గ్రామాల మధ్యస్నేహ సంబంధాలు మెరుగుపడుతాయని పేర్కొన్నారు. అనంతరం ఆయన క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడి యువకులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు యాదవ్, మాజీ సర్పంచ్ నెమలి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు బీవీ రమణరాజు, నాయకులు వంగూరి కృష్ణప్రసాద్, వంగూరి రేణుకబుజ్జయ్య, కిశోర్‌నాయక్, కూన్‌రెడ్డి లింగారెడ్డి, మాలె సత్యంరెడ్డి, దుర్గారెడ్డి, రవీంద్రచారి, నాగార్జున, క్రికెట్ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, పొదిల మల్లయ్య, శ్రవణ్‌కుమార్, లింగాల రవి, రమేష్, జలందర్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సాయిబాబా దేవాలయ అభివృద్ధికి కృషి


సాయిబాబా విగ్రహానికి నమస్కరిస్తున్న చైర్మన్ గుత్తా

దేవరకొండ, జూన్ 27: దేవరకొండ షిర్డీ సాయిబాబా దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం దేవరకొండ పట్టణం డిండి రోడ్డులోని షిర్డీ సాయి బాబా, జ్ఞాన సరస్వతీదేవి దేవాలయాల వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని అన్నారు. అనంతరం ఆలయకమిటీ నిర్వాహకులు సుఖేందర్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఆలయకమిటీ చైర్మన్ ఇల్లందుల శ్రవన్‌కుమార్, దొడ్డి సుధాకర్, కర్నాటి జనార్దన్, పానగంటి మల్లయ్య, వెంకటేశ్వర్లు, చీదేళ్ల వెంకటేశ్వర్లు, వాస వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, చిలువేరు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డిండి, జూన్ 27: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో కృష్ణకుమారి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శైలి, సురేష్, విజయలక్ష్మి, గీత, శ్రీలత, బాలమ్మ, అఖిల పాల్గొన్నారు.

జిల్లా వాసులకు జాతీయ పురస్కారాలు


అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

దేవరకొండ, పెద్దఅడిశర్లపల్లి, జూన్ 27: దేవరకొండకు చెందిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డును అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 25న రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధకృష్ణ అందజేశారు. వస్కుల సత్యనారాయణ జెన్‌కోలో డీఈగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ దేవరకొండ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా పలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. విద్యార్థి దశ నుంచే సత్యనారాయణ ప్రజా ఉద్యమాలు, బహుజన ఉద్యమాల్లో అంబేడ్కర్ భావజాలంతో ప్రజలకు సేవలందించినందుకు అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు.


అవార్డు అందుకుంటున్న విజయలక్ష్మి

● గుడిపల్లి మండలంలోని చిలకమర్రి గ్రామ పంచాయతీ సర్పంచ్ కేతావత్ విజయలక్ష్మీమూన్యానాయక్ ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ సదస్సులో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అవార్డును అందజేశారు.

'విద్యార్థులతో చెలగాటం ఆడుతున్న కేంద్రం'

హాలియా, జూన్, 27: కేంద్రప్రభుత్వం నీట్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఢిల్లీలో జాతీయ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నీట్ పరీక్షను రద్దు చేయాలని నిర్వహించిన పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని దీనికి బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఆర్భాటాల మీద ఉన్న ఆసక్తి విద్యార్థుల జీవితాలపై లేదని అర్థమవుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, యువకులు అప్రమత్తంగా వ్యవహరించి పరీక్షలు సక్రమంగా నిరవహించాలన్నారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్‌నాయక్, సాగర్, దేవరకొండ నియోజకవర్గాల అధ్యక్షులు పగడాల నాగరాజు, కిన్నెర హరికృష్ణ, మందుల సైదులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి మోక్షమెప్పుడో?


ఇటీవల కురిసిన వర్షానికి చండూరు వాగుపై పారుతున్న వరద నీరు (ఇన్‌సెట్‌లో) గతేడాది శంకుస్థాపన చేసిన శిలాఫలకం

చండూరు, జూన్ 27: చండూరు- మునుగోడు మార్గమధ్యలో చండూరు శివారులో వాగు వరద కష్టాలు తీర్చడం కోసం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎఫ్‌డీఆర్ నిధులు మంజూరు చేసింది. వాగు లోతట్టు వంతెన ఉండటంతో వర్షాకాలంలో ప్రయాణికులు ఇబ్బందులకు గురవున్నారు. వర్షాకాలంలో వరద నీటికి పలువురు ప్రయాణికులు వాగులో కొట్టుకుపోయి, మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. దీంతో హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రయాణికుల నుంచి డిమాండ్ రావడంతో గత ప్రభుత్వం రూ.4.75 కోట్లు మంజూరు చేసింది. దీంతో చండూరు పట్టణ ప్రజలు, ప్రయాణికులు దశాబ్ద కాలంగా ఎదుర్కొంటున్న సమస్య ఇక తీరనుందని అనుకున్నారు. కానీ నేటికి ఆ కల నెరవేరలేదు.

● చండూరు నుంచి మునుగోడుకు వెళ్లే మార్గమధ్యలో చండూరు నుంచి తాస్కానిగూడెం వరకు ఉన్న 3 కిలోమీటర్లు బీటీ రోడ్డు పంచాయ తీరాజ్ శాఖలో ఉంది. దీంతో రోడ్డు విస్తరణ, హైలెవల్ వంతెన నిర్మాణానికి ఇప్పటి వరకు అడ్డంకిగా ఉండేది. ప్రస్తుతం చండూరు మునిసిపాలిటీ పరిధిలోకి రావడంతో సమస్య పరిష్కారమైంది. 2018 తర్వాత ఎక్కువగా భారీగా వరదలు రావడంతో వాటు పొంగిపొర్లింది. అప్పట్లో దంపతులు వాగు దాటుతుండగా వరదలో కొట్టుకుపోయారు. స్థానికులు వారిని రక్షించారు. పలుమార్లు రాకపోకలు నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. మునుగోడు ఉప ఎన్నికలో అధికార పార్టీ ఇచ్చిన హామీల్లో ఇదొకటి కావడంతో, గెలిచాక వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టి గతేడాది 2023 అక్టోబరు 4వ తేదీన నాటి మంత్రి జగదీష్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు.

● చండూరు మునిసిపాలిటీలో ప్రజలు వర్షాకాలంలో వరదలు వచ్చే క్రమంలో నల్లగొండ, హైదరాబాద్ వైపు ప్రయాణించడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎక్కడైతే లోతట్టు వంతెనలు, కల్వర్టులు ఉన్నాయో వాటిపైన అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సంబంధిత అధికారులతో నివేదికలను తెప్పించుకుని పరిశీలించారు. అంగడిపేట శివారులో లోతట్టు వంతెన కూడా హైలెవల్ వంతెనగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపారు. మునుగోడు వైపు వెళ్లే మార్గంలో కూడా ఉన్న కల్వర్టుల పైనా దృష్టి సారించారు. శంకుస్థాపన చేసి ఏడాది కావస్తున్నా పనులు నేటికీ ప్రారంభించకపోడంతో ప్రజాప్రతినిధులు, అధికారులపై ప్రజలు, ప్రయాణికులు మండిపడుతున్నారు. రానున్న భారీ వర్షాలతో వాగు పొంగితే, వాగు తెగిపోయే ప్రమాదం పొంచి ఉందని, అధికారులు బ్రిడ్జి పనులు ప్రారంభించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టడానికి ఉన్నతాధికారుల నుండి డిజైన్ రావాల్సి ఉందని, డిజైన్ రాగానే టెండర్ ప్రక్రియ చేపట్టాక పనులు చేపడుతామని పంచాయతీరాజ్ ఏఈ రమేష్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు ప్రారంభిస్తామని వివరించారు.

పొలం పనులకు వాగు దాటాల్సిందే



చండూరు వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. కానీ శంకుస్థాపన చేసి ఏడాది కావొస్తున్నా, నేటికీ పనులు ప్రారంభించలేదు. ఇటీవల కుసిన చిన్నపాటి వర్షానికే వాగు వచ్చి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. వర్షాకాలం వచ్చింది, మా వ్యవసాయ పొలం పనులకు వెళ్లాల్సి వస్తే ఈ వాగు దాటాల్సిందే. పొలం పనులకు వెళ్లాంటే భయంగా ఉంది. వంతెన నిర్మాణం పూర్తయితే ఇక ఎలాంటి సమస్య ఉండదు.

● సంకబుడ్డి లింగయ్య, రైతు

వంతెన త్వరగా నిర్మించాలి

వంతెన త్వరగా పూర్తి చేసి, చండూరు నుంచి మునుగోడు రోడ్డులో ఉన్న సింగిల్ రోడ్డును కూడా డబుల్ రోడ్డుగా మారిస్తే ప్రయాణానికి ఇంకా సులువుగా ఉంటుంది.

● తిరందాసు నందు, చండూరు

నీట్ పరీక్ష విధానాన్ని,ఎన్‌టీఏను రద్దు చేయాలి



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు

నల్లగొండ, జూన్ 27: జాతీయ స్థాయిలో ఒకే పరీక్ష విధానాన్ని ఏర్పరచడం వల్ల ఇబ్బందులు తలెత్తున్నందున నీట్ పరీక్ష విధానాన్ని, ఎన్‌టీఏను రద్దు చేయాలని విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. గురువారం జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డెమొక్రటిక్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.సోమయ్య మాట్లాడుతూ మారుమూల ఆదివాసిగూడలో చదివే విద్యార్థులకు ఈ విధానం వల్ల తీవ్రనష్టం జరుగుతుందన్నారు. ఢిల్లీ, మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో చదివే విద్యార్థులకు, మారుమూల ప్రాంతాల్లో చదివే విద్యార్థులకు తేడా ఉంటుందని అన్నారు. విద్యార్థులందరికీ ఒకే ప్రమాణంతో పరీక్ష నిర్వహించడం అశాస్త్రీయమన్నారు. వెంటనే నీట్, సీయూసెట్, యూజీసీ సెట్ వంటి జాతీ య పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రమే యూనివర్సిటీల ద్వారా పరీక్షలు నిర్వహించేలా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు వెంకులు, ప్రధాన కార్యదర్శి రత్నయ్య, నాయకులు పి. గోపాల్‌రెడ్డి, ఖుర్షీద్‌మియా, కాశయ్య, ఏడుకొండల్, సాగర్, మల్లేష్, వీరయ్య, జగతి, అశోక్‌కుమార్, ఫిరోజు, దేశ్‌ముఖ్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు


వేములపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వేములపల్లి, జూన్ 27: మండల పరిధిలోని మూసీ, పాలేరు వాగుల నుంచి అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ, ఎస్‌ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని సల్కునూరు, రావులపెంట గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల వినియోగంపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆన్‌లైన్ ద్వారా ఇసుక రవాణాకు అనుమతులు ఉన్న వారు మాత్రమే ఇసుక రవాణా చేపట్టాలని, ఇసుక రవాణాకు ఉపయోగించే ట్రాక్టర్లకు నెంబర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ విధానంలో అనుమతి పొందిన తర్వాతే నిర్ణీత సమయంలో ఇసుకను తరలించాలన్నారు. గ్రామాల్లోని యువత మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు తమ చిన్నారుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ నంద్యాల శ్రీరాంరెడ్డి, మాజీ సర్పంచులు దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, అంకెపాక రాజు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

● **హాలియా:** ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని, జరిమానాలు కాకుండా ట్రాక్టర్లు సీజ్ చేసి కోర్టుకు అప్పగిస్తామని తహసీల్దార్ జయశ్రీ, హాలియా సీఐ జనార్దన్ గౌడ్ అన్నారు. హాలియాలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానులకు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. స్యాండ్ ట్యాక్స్ పాలసీ ప్రకారం మైనింగ్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న ట్రాక్టర్లు, కేటాయించిన రీచ్‌ల నుంచి మాత్రమే ఇసుక రవాణా చేయాలని అన్నారు. చెరువుల్లో కూడా మట్టిని అక్రమంగా తరలించవద్దని, అధికారుల అనుమతితో రైతులు తమ పొలాలకు తోలుచేవచ్చని అన్నారు. గతంలో లాగా ట్రాక్టర్లకు జరిమానా విధించకుండా కోర్టుకు మాత్రమే అప్పగించనున్నట్లు తెలిపారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో సుజాత, ఏఈ జగపతిబాబు, మునిసిపల్ మేనేజర్ రషీద్ పాల్గొన్నారు.

సాధారణ కాన్పులపై అవగాహన కల్పించాలి


హాలియాలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

హాలియా, జూన్, 27: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు సాధారణ కాన్పుపై అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ డాక్టర్ రామకృష్ణ అన్నారు. పట్టణంలో గురువారం అనుముల ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ నిర్వహణపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాధారణ కాన్పునకు ఎలా సిద్ధం చేయాలి, ఏఏ సలహాలు ఇవ్వాలనే అంశంపై వివరించారు. సాధారణ కాన్పు వల్ల 15 సంవత్సరాల అదనపు జీవిత కాలాన్ని పొడించుకోవచ్చని అన్నారు. సీడీపీవో పద్మావతి మాట్లాడుతూ పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడానికి సమతుల ఆహారం ఇవ్వాలని అన్నారు. అనంతరం మిర్యాలగూడ సీడీపీవో మమత, సూపర్‌వైజర్ నజిమా అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ గణిత భావన, మంచి అలవాట్లు, కథలు, పాటలు, ఆటలు, సృజనాత్మకత, శాస్త్రీయ పరిజ్ఞానం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమాదేవి, సరిత, సైదాబేగం, నాగమణి, వెంకాయమ్మ, యాదమ్మ, విజయలక్ష్మి, గౌసియాబేగం, రాజరాజేశ్వరీ, కవిత, బీసీ పవన్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

8 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

నల్లగొండ రూరల్, జూన్ 27: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న డీసీఎంను పట్టుకుని 8 టన్నుల బియ్యాన్ని సీజ్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శంకర్ తెలిపారు. ఎస్‌ఐ శంకర్ తెలిసిన వివరాల ప్రకారం... మండలంలోని పలు గ్రామాల నుంచి సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని నల్లగొండ పట్టణంలోని ఓ రైసు మిల్లులో లోడ్ చేసి అక్కడి నుంచి బుధవారం రాత్రి తుఫ్రాన్‌పేటలోని కోళ్లఫారానికి తరలిస్తుండగా డీఈవో కార్యాలయం దగ్గర డీసీఎంను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి డీసీఎం డ్రైవరర్ కమ్ ఓనర్ మురుగునూతల భిక్షంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భూ వివాదాలు కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలి

● డీఎస్పీ శివరాంరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

శాలిగౌరారం, జూన్ 27: రైతులు భూమి వివాదాలు ఉంటే కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి అన్నారు. శాలిగౌరారం పోలీస్‌స్టేషన్ గురువారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమిని సేద్యం చేసుకుంటూ కబ్జాలో ఉన్న రైతులను ఇబ్బందికి గురి చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూ వివాదాలను గ్రామస్థాయిలోనే సామరస్యంగా పరిష్కరించుకోవాలని అన్నారు. రైతులు ఒకరినొకరు సహకరించుకుని భూ తగాదాలను ప్రశాంతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. నల్లగొండ డివిజన్‌లో క్రైం రేటును తగ్గించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పావురాలగూడెం, బైరవునిబండ గ్రామంలో భూ వివాద స్థలాలను పరిశీలించారు. డీఎస్పీ వెంట శాలిగౌరారం ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, రైతులు ఉన్నారు.

నల్లగొండ బైపాస్ నిర్మాణానికి ఆప్షన్ 3ని మార్చాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ, జూన్ 27: జాతీయ రహదారి 565కు అనుసంధానంగా ఉన్న నల్లగొండ బైపాస్‌కు సంబంధించిన ఆప్షన్ -3 మార్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి కోరారు. గురువారం ఢిల్లీలోని శాస్త్రిభవన్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర మంత్రి వెంటనే స్పందించి ఆప్షన్ -3 మార్పుపై పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో జనగాం వెంకన్నగౌడ్, దోనాల నాగార్జున్‌రెడ్డి, బీరవెల్లి వీరప్రసాద్, కుక్కల వెంకట్‌రెడ్డి, ఉజ్జిని వెంకటనర్సింహారావు ఉన్నారు.

'ప్రైవేట్ పాఠశాలలో ఫీజు దోపిడీని అరికట్టాలి'

దామరచర్ల, జూన్ 27: ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న ఫీజు దోపిడీని అరికట్టాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ నారాయణరెడ్డికి ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులను వసూలు చేయడమే కాకుండా నోట్ పుస్తకాలు, యూనిఫాం, టైలు, బెల్టులు వంటి వాటి పేరుతో అదనంగా వసూళ్లు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలను అమ్ముతున్నా వాటిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, బీసీ సంఘం నాయకులు శంభయ్య, ఎర్రమాద ఉమామార్, కంభంపాటి నాగరాజు, శ్రీ కాంత్, బాబు, సైదారాజు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి : ఐద్వా

మాడ్గులపల్లి, జూన్ 27: మండలంలోని పాములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలను పరిష్కరించాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధని డిమాండ్ చేశారు. గురువారం పాములపాడు పీహెచ్‌సీని ఐద్వా ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా గోవర్ధని మాట్లాడుతూ ఆసుపత్రిలో విద్యుత్, బాత్‌రూమ్, వాచ్‌మన్ సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు తంగెళ్ల నాగమణి, ఆర్.నాగమణి, ఇందిరమ్మ, మంగమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రామగుండం థర్మల్‌పవర్ నిర్మాణాన్ని టీజీజెన్‌కోకే ఇవ్వాలి

నాగార్జునసాగర్, జూన్ 27: రామగుండంలో ప్రభుత్వం నూతనంగా నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ పవర్ హౌస్ నిర్మాణాన్ని టీజీ జెన్‌కోకే ఇవ్వాలని టీజీజెన్‌కో సాగర్ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం చీఫ్ ఇంజనీర్ మంగేష్‌కుమార్‌ను జేఏసీ బృందం కలిసింది. విద్యుత్ ఉత్పాదన అనేది జెన్‌కోకు సంబంధించిన విషయమని, రామగుండం సమీపంలోనే జెన్‌కో దగ్గరగా ఉండటం ఇతర విద్యుత్ ఉత్పత్తి కంపెనీలతో పోల్చితే తక్కువ ఖర్చులో టీజీజెన్‌కో ఉత్పత్తి చేయగలదన్న విషయాన్ని చెప్పారు. థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణాన్ని టీజీజెన్‌కోకే ఇచ్చేలా ప్రభుత్వం పునరాలోచన చేయాలని, లేనిచో జేఏసీ నాయకుల పిలుపు మేరకు భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని పేర్కొంటూ సీఈకి వినతిపత్రం అందజేశారు.

సంక్షిప్త సమాచారం...

డిండి: డిండి మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డానియెల్ తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అన్నారు. ఎంపీపీ మాధవరం సునీత అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ ద్వారా కవనెంట్ చర్చి ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీటీసీ మాదగోని కవిత ప్రారంభించగా 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. కంటి పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీమ్ లీడర్ జంగా జయరాజు, క్యాంపు కోఆర్డినేటర్, పాస్టర్ జిల్లా శ్యాంసన్, డాక్టర్లు వాసవి, భారత్, స్వరూప్ పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన కేజీబీవీ పాఠశాలను సందర్శించి మాట్లాడారు. పాత భవనంలో తరగతి గదులు, బాత్రూంలు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు లేక విద్యార్థినులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: మండల కేంద్రానికి చెందిన వట్టె రామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా పీఏపల్లి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ఇన్సూరెన్స్ కట్టడంతో ఆయనకు రూ.2లక్షలు బీమా వచ్చిందని బ్రాంచ్ మేనేజర్ రమేష్‌రెడ్డి తెలిపారు. మృతుని భార్య మల్లమ్మకు బ్రాంచ్‌మేనేజర్ చెక్కును అందజేశారు.

దేవరకొండ: దేవరకొండ మునగాల కొండల్‌రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న అతిథి, అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవినాయక్ ప్రకటనలో తెలిపారు. పీజీ డిగ్రీలో 55 శాతం మార్కులు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. అర్హత గలవారు దరఖాస్తులను కళాశాలలో జూలై 3వ తేదీలోపు అందజేయాలని కోరారు.

మర్రిగూడ: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి యువత సహకరించాలని కాంగ్రెస్ పార్టీ నాంపల్లి గ్రామ కన్వీనర్ జైపాల్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులకు రాజకీయాలకతీతంగా సహకరించాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ జంగయ్య, మహేందర్, నర్సింహ, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

చందంపేట, చింతపల్లి: గిరిజన ప్రాంతమైన దేవరకొండ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని దేవరకొండ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ వంశీశర్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పూరె లక్ష్మణ్ కోరారు.

చిట్యాలరూరల్: మండలంలోని ఆరెగూడెంకు చెందిన ఎడ్ల మహేష్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. చిన్ననాటి స్నేహితులు రూ.50 వేలు సేకరించారు. మహేష్ కుమార్తె మానస పేరిట రూ.50వేలను స్థానిక పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి బాండ్‌ను భార్య రజిత, కుమార్తెలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్, నీలకంఠం లింగస్వామి, చేకూరి గణేష్, రాములు, లింగస్వామి, కిరణ్ పాల్గొన్నారు.

కట్టంగూరు: మండలంలోని గార్లబాయిగూడెం గ్రామానికి చెందిన చింత సైదులు, ఉపేంద్ర దంపతులు అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 60మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నారాయణ, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, సునీత, అనిత, అంకిత, లిఖిత పాల్గొన్నారు.

మర్రిగూడ: నిరుపేద విద్యార్థులకు సేవాభావంతో ముందుకు వచ్చి స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం అభినందనీయమని ఎస్‌ఐ రంగారెడ్డి అన్నారు. మండలంలోని కుదాబక్షపల్లి గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు బేథెల్ యు లైట్ చర్చి, వట్టిపల్లి వారి సహకారంతో బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ కృపాదానం, సురేష్ పాల్గొన్నారు.

దేవరకొండ: భారత నౌకదళంలో పైలెట్‌గా ఎంపికైన గన్యనాయక్‌తండాకు చెందిన అరవింద్‌చౌహాన్‌ను సన్మానించారు. అరవింద్ చౌహాన్ కష్టపడి చదివి నౌకాదళంలో పైలెట్ స్థాయికి ఎదిగాడని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అరవింద్ చౌహాన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చొల్లేటి భాస్కరచారి, అంకం చంద్రమౌళి పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

● 4కేజీల వెండి, బంగారు వస్తువుల అపహరణ

దామరచర్ల, జూన్ 27: ఆలయంలో చోరీకి పాల్పడి వెండితో పాటు బంగారు వస్తువులను అపహరించారు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున మండలంలోని వీర్లపాలెం గ్రామంలో గల రామాలయంలో చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం... గుర్తు తెలియని దుండగులు ఆలయం తలుపులు పగులగొట్టి ఆలయంలోని సుమారు 4 కేజీల వెండి వస్తువులు, మరికొన్ని బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఈ విషయమై ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో క్లూస్ టీంలను రప్పించి ఆధారాల కోసం అన్వేషించారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

కిరాణం దుకాణానికి నిప్పు

డిండి, జూన్ 27: మండలంలోని సింగరాజుపల్లి గ్రామపంచాయతీ బండకాడితండాలో గుర్తు తెలియని వ్యక్తు లు కిరాణం దుకాణానికి బుధవారం రాత్రి నిప్పంటించారు. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన మాజీ ఉప సర్పంచ్ రమావత్ లక్ష్మి తండా వద్ద కిరాణ దుకాణం నిర్వహిస్తుంది. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దుకాణానికి నిప్పంటించారు. అందులో ఉన్న కుట్టు మిషన్, ఫ్రిడ్జి, నగదు, దుస్తులు, ఫర్నీచర్, కూల్‌డ్రింక్స్, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షలకు పైగా ఆస్తిన నష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.